ఈనాడు
పెద్దపల్లి
మంగళవారం అక్టోబరు 15, 2024 5

ధరణి దరఖాస్తులు పరిష్కరించండి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ధరణి సమస్యల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆయన ధరణి సమస్యల పెండింగ్ దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించాలని.. ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వ భూముల చుట్టూ పెన్సింగ్ వేసుకునేందుకు అయ్యే ఖర్చు ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవోలు గంగయ్య, హనుమాన్ నాయక్, తహసీల్దార్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పకడ్బందీ కార్యాచరణ అవసరం

పెద్దపల్లి: అసాంక్రమిక వ్యాధుల సర్వేను డిసెంబరుకల్లా పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నేడు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల డీఎస్సీ 2024కి ఎంపికైన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారిణి మాధవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల టీచర్స్ భవన్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీలు ఉదయం పది గంటలకు.. ఎస్జీటీలు మధ్యాహ్నం ఒంటిగంటకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు ఉపాధ్యాయ ఖాళీల వివరాలను జగిత్యాల డీఈవో వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని హాజరు కావాలని సూచించారు.

వనరులు పుష్కలం పరిశ్రమల స్థాపనకు అనుకూలం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధిపై ఆశలు

ఈనాడు, కరీంనగర్



రాష్ట్ర ప్రభుత్వం 24 భారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించడంతో.. వాటి స్థాపనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అనుకూలమనే మాట అందరినోట వినిపిస్తోంది. ఇప్పటికే పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఉమ్మడి జిల్లాకు మంచి గుర్తింపు లభిస్తోంది. పైగా పరిశ్రమలశాఖ మంత్రి జిల్లాకు చెందినవారవడం అదనపు బలం. రవాణా, మార్కెటింగ్ కోసం రోడ్లు, రైలు మార్గాలు, నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో నాలుగు జిల్లాల్లో పారిశ్రామిక వికాసం వెల్లివిరియాలనే ఆకాంక్ష క్రమంగా పెరుగుతోంది.


ఈ ప్రభుత్వంలోనైనా సాధ్యపడేనా..

గత ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల్ని ఏర్పాటు చేస్తామని.. జగిత్యాల జిల్లా వెల్గటూర్, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి, గంభీరావుపేట్, కరీంనగర్ గ్రామీణ మండలాల్లో పలు ప్రాంతాలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపినా.. ఆచరణలో సాధ్యపడలేదు. ప్రస్తుత ప్రభుత్వమూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికుల్ని ఆహ్వానిస్తోంది. ఇప్పటి వరకు 86,552 అనుమతి పొందగా.. మరో 15వేల దరఖాస్తులు ఈ వార్షిక సంవత్సరంలో అందే వీలుంది.

తోడ్పాటు అందిస్తూ..

● టీజీఐఐసీ ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పారిశ్రామికవాడలను గతంలోనే గుర్తించారు. వీటి పరిధిలో దాదాపుగా 3వేల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. కరీంనగర్‌లోని పద్మానగర్‌లాంటి చోట సౌకర్యాల్ని మెరుగుపరచాల్సి ఉంది.

● తోలు ఉత్పత్తి సముదాయాన్ని(లెదర్‌పార్క్) చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన పదిహేనేళ్లుగా నానుతోంది. 135 ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచినా.. ఇప్పటికీ ఇక్కడ పురోగతి లేనే లేదు. ఇందులోని 100 ఎకరాల్లో బెటాలియన్ ఏర్పాటు చేశారు. మిగతా స్థలం అలాగే ఉంది. నాలుగు జిల్లాల్లో దాదాపుగా 64 పరిశ్రమలు గతంలో ప్రతిపాదనలు పెట్టుకున్న వాటి పునరుద్ధరణకు తోడ్పాటు అందాల్సి ఉంది.



ఘనమైన ఫలితాలు..

● 256 కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు, మరో 300కిపైగా గ్రానైట్ క్వారీలు ఏర్పాటైన జిల్లాలో వేలాదిమందికి ఉపాధిని అందిస్తోంది. రాష్ట్రానికి గనుల ద్వారా అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే ప్రాంతంగా పేరొచ్చింది.



● సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) 2023-24లో 70.02 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇందులో గోదావరిఖని ప్రాంతంలోని కార్మికుల శ్రమ గణనీయంగా ప్రతి ఏడాది కనిపిస్తోంది.

ఎంఎస్ఎంఈ (ఉద్యం పోర్టల్‌లో నమోదు)

జిల్లా	ఉత్పత్తి	సేవారంగం	మొత్తం
కరీంనగర్	8,082	28,887	36,969
జగిత్యాల	4,861	14,997	19,858
పెద్దపల్లి	3,081	13,366	16,447
సిరిసిల్ల	3,557	9,721	13,278
మొత్తం	19,581	66,971	86,552

● రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఏటా 4.95 లక్షల టన్నుల యూరియా, 2.97 లోల టన్నుల అమ్మోనియా లక్ష్యంగా ఏర్పాటై ఫలితాల్నిస్తోంది. స్థానికులకు ఉపాధి మెరుగైంది.

● సిరిసిల్ల జిల్లా పెద్దూరు సమీపంలో 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్కులో కోట్లాది రూపాయల పనులతో ఉపాధి లభిస్తోంది. సూపర్‌హబ్‌గా పేరొందిన ఇక్కడి వస్త్రోత్పత్తికి మరింత తోడ్పాటు అందాలి.

తిరుగు ప్రయాణంలో ఇక్కట్లు



దసరా పండగ సెలవులు సోమవారంతో ముగియడంతో విద్యార్థులు, పిల్లలు, మహిళలు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రయాణ ప్రాంగణాలకు వచ్చారు. ఒకేసారి పెద్దమొత్తంలో రావడంతో సరిపడా బస్సులు లేక ఇక్కట్లు పడ్డారు. ఒక్కో బస్సులో వంద మందికి పైగా తమ ప్రయాణాన్ని కొనసాగించాల్సి రావడంతో పిల్లలు, మహిళలు ఇబ్బంది పడ్డారు. మరికొందరు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లారు. - న్యూస్‌టుడే, సుల్తానాబాద్

ఇష్టంగా చదివితేనే ఉన్నత శిఖరాలకు..

రామగుండం, న్యూస్‌టుడే: ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. రామగుండంలోని తబితా ఆశ్రమంలో సోమవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు చరవాణి, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ.. పట్టుదలతో చదువుకోవాలన్నారు. గోదావరిఖని బార్ అసోషియేషన్ అధ్యక్షులు సతీష్, న్యాయవాదులు శైలజ, శ్రీనివాస్, భూమయ్య, ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

రైతేరాజు 6లో

మేల్కొంటేనే పచ్చదనం!

వచ్చే ఏడాది మొక్కల పెంపకం లక్ష్యం ఖరారు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఏటా ఆర్భాటంగా లక్షల్లో మొక్కలు నాటుతున్నా.. సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. రూ.కోట్ల నిధులు ఖర్చైనప్పటికీ ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 2025-26 ఏడాదికి సంబంధించి మొక్కల పెంపకం లక్ష్యాన్ని నిర్ణయించారు. విత్తన దశలోనే నిర్లక్ష్యం నెలకొంది. నర్సరీల్లో మౌలిక వసతులు కొరవడి వేసవి ఎండ వేడిమి తట్టుకోలేక ఎండిపోతున్నాయి. గత అడ్డంకులు అధిగమిస్తేనే హరిత కల ఫలించనుంది.

ఇదీ పరిస్థితి

● మొక్కల కొరత లేకుండా ఊరికొక నర్సరీ ఉంది. అక్కడ నీడ కోసం పైకప్పు ఏర్పాటు చేయడం లేదు.

● చుట్టూ కంచె లేక మొక్కలు పశువులకు మేతగా మారుతున్నాయి.

● బోరు వసతి కొరవడటంతో మొక్కలు నీరందడం లేదు.

● నాణ్యమైన విత్తనాలు కాకపోవడంతో సంచుల్లో చనిపోతున్నాయి.

● గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటగా ప్రస్తుతం వన మహోత్సవం పేరిట ఈ కార్యక్రమం అమలవుతోంది.

● నర్సరీల్లో సీతాఫలం, నిమ్మ, బత్తాయి, జామ, అల్లనేరడి, జామ, చింత, మల్లె, జాజిమల్లె ఇలా.. పూలు, నీడనిచ్చె తదితర మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

● నర్సరీల్లో విత్తనం విత్తిన నుంచి మూడేళ్లలోపు నిర్వహణ కోసం ఉపాధిహామీ నిధులు కేటాయిస్తున్నారు.

● నర్సరీల్లో సంచుల్లో నింపి విత్తనాలు, విత్తడం సుమారు 2 మీటర్ల ఎత్తు మొక్క ఎదిగే వరకు ఒక్కోదానికి రూ.114, నాటిన మొక్క రక్షణకు ముళ్లచెట్లతో రక్షణ కంచె (పెన్సింగ్)కు రూ.190, మరో రెండేళ్ల నిర్వహణకు రూ.126 ఇలా మొత్తం ఒక్కో మొక్కకు రూ.430 ఖర్చవుతోంది.

● వచ్చే ఏడాది 16.34 మొక్కలు నాటాలని లక్ష్యం విధించారు. పది శాతం అదనంగా నర్సరీల్లో 20.69 లక్షల మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు.


పెద్దపల్లి: నీడ లేని నర్సరీ

● నర్సరీల్లో ప్రతి మొక్క మూడు మీటర్ల వరకు ఎత్తు ఎదగాలి. కానీ.. విత్తనాల్లో నాణ్యత లేమి, నీళ్ల సమస్య, షేడ్ నెట్‌లతో నీడ అందివ్వకపోవడం వంటి కారణాలతో మొక్కలు ఆశించిన మేర ఎదగడం లేదు. విత్తన దశలోనే మేల్కొంటేనే వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం అవుతోంది. ఆ దిశగా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది.

విపణి లేక వీధి వ్యాపారం

సుల్తానాబాద్ పట్టణంలో సమీకృత విపణి లేక ఇటు చిరువ్యాపారులు, అటు పట్టణవాసులు ఇక్కట్లు పడుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో ఉన్న సుమారు 35 వేల జనాభాకు అనుగుణంగా ఒకేచోట కూరగాయలు, మాంసం, తదితర సామగ్రి అందించాలనే లక్ష్యంతో సుల్తానాబాద్ పట్టణంలో యాదవనగర్ సమీపంలోని సర్వే నంబర్ 779లో రూ.2 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రెండేళ్లు గడుస్తున్నా పనులు పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ఇప్పటికే చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదనే సాకుతో గుత్తేదారులు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. పట్టణంలో సమీకృత మార్కెట్ లేక చిరువ్యాపారులు రహదారుల పైనే, పక్కనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు చొరవ చూపి మార్కెట్ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు. పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్యపై ఎమ్మెల్యే విజయ రమణారావు, జిల్లా అధికారులకు విన్నవించామన్నారు.

- న్యూస్‌టుడే, సుల్తానాబాద్


రహదారులపై చిరువ్యాపారుల విక్రయాలు


సుల్తానాబాద్‌లో పిల్లర్లకే పరిమితమైన సమీకృత మార్కెట్ నిర్మాణం

ఉపాధి శిక్షణకు తరలిన యువత

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకున్న 150 మంది నిరుద్యోగ యువకులను బస్సు ద్వారా హైదరాబాద్ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌కు సోమవారం పంపించారు. ఈ మేరకు సింగరేణి టీటీసీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఖని ఏసీపీ రమేశ్‌లు హాజరయ్యారు. రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ తేజస్విని, సీఎంఓఏఐ ప్రతినిధి నర్సింహులు, పీఎం కిరణ్ బాబు, అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని రాధా కృష్ణ ఆలయ ఆవరణలో దుర్గామాత శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు ఏకరూప దుస్తులు ధరించి కోలాటం, నృత్యాలతో శోభాయాత్రకు తరలివెళ్లారు.


నృత్యాలు చేస్తున్న మహిళలు

ప్రజావాణి అర్జీల స్వీకరణ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పలుశాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ

సీఎం కప్ క్రీడలతో యువకుల్లో ఉత్సాహం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: యువకుల్లో నూతన ఉత్సాహం నింపేందుకు నవంబరులో రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విజయ రమణారావు పేర్కొన్నారు. సీఎం కప్ జ్యోతి సోమవారం సుల్తానాబాద్‌కు చేరుకోగా పట్టణంలోని శాస్త్రీనగర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లు క్రీడారంగాన్ని విస్మరించిందని.. గుట్టల్లో, చెరువు శిఖాల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేసి రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని వివరించారు. క్రీడా సామగ్రి తుప్పుబట్టిపోయాయని ధ్వజమెత్తారు. సుల్తానాబాద్ క్రీడాకారులకు పుట్టినిల్లు అని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో మినీ స్టేడియాన్ని మరమ్మతులు చేయించి పట్టణంలో క్రీడలకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు మండల, జిల్లా కేంద్రాల్లో ఉచిత క్రీడా శిక్షణ కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, డీవైఎస్‌వో సురేశ్, క్రీడా ప్రతినిధులు, క్రీడాకారులు, పట్టణవాసులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్: సీఎం కప్ జ్యోతి ప్రదర్శనలో ఎమ్మెల్యే విజయ రమణారావు తదితరులు

పంచాయతీ భవనాల పూర్తెప్పుడో?

న్యూస్‌టుడే, మంథని

మంథని డివిజన్‌లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సా.. గుతున్నాయి. కొత్తగా గ్రామాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. పంచాయతీ కార్యాలయాలు ఇప్పటికీ అందుబాటులోకి రావడం లేదు.

ప్రగతిపై ప్రభావం

మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు 2023లో 24 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఏడు గ్రామ పంచాయతీల్లో స్థలాలు అందబాటులో లేక పనులు ప్రారంభం కావడం లేదు. పాలకుల నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపులో జాప్యం వంటి కారణాలతో సకాలంలో పంచాయతీ భవనాల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో, అరకొర వసతుల మధ్య పంచాయతీల నిర్వహణ జరుగుతోంది. స్థలాలు అందుబాటు లేనిచోట అనువైన స్థలాలను కేటాయింపు చేయడంపై అధికారులు తగిన శ్రద్ధ వహించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించడం లేదని గుత్తేదారులు వాపోతున్నారు.

ఎక్కడెక్కడ పనులు జరిగాయంటే..

● మంథని మండలంలో 12 గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కాగా చిల్లపల్లి భవనం పూర్తయింది.

● ఆరెందలో స్థలం అందుబాటులో లేక నిర్మాణ పనులు ప్రారంభించ లేదు.

● గతంలో నిధులు మంజూరై స్థలం లేక నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో నిధులు రద్దయ్యాయి.

● భట్టుపల్లి, గద్దలపల్లి, కాకర్లపల్లి, బిట్టుపల్లి, సూరయ్యపల్లి, గుమున్నూరు గ్రామాల్లో పంచాయతీల భవనాల పనులు శ్లాబ్ వరకు జరిగాయి.

● వెంకటాపూర్ జీపీ భవనం పనులు బీమ్ లెవల్ వరకు జరిగాయి.

● ముత్తారం మండలంలో నాలుగు భవనాలకు పోతారం, హరిపురం జీపీ భవనాలు శ్లాబ్ వరకు పనులు జరిగాయి.

● దడియాపూర్, మచ్చుపేట గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు.

● రామగిరి మండలంలో ఎనిమిది పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కాగా నావాబుపేట, కాల్వచెర్ల, బుధవారంపేటలో భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

● రాజాపూర్, నాగేపల్లిలో స్థలం అందుబాటులో లేక పనులు ప్రారంభించలేదు.

● చందానాపూర్, లోంకకేసారంలో రూఫ్‌లెవల్ వరకు పనులు జరిగాయి.

● కమాన్‌పూర్ మండలంలో సిద్ధపల్లి, గొల్లపల్లి పంచాయతీ భవనాలకు నిధులు మంజూరుకాగా స్థలాలు అందుబాటులో లేక పనులు ప్రారంభించ లేదు.


అసంపూర్తిగా సూరయ్యపల్లి భవన నిర్మాణం

నాలుగు నెలల్లో పనులు పూర్తి

అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాల నిర్మాణ పనులను నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం. కొన్నిచోట్ల బిల్లులు మంజూరైనా నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో స్థలాలు అందుబాటు లేక పనులు ప్రారంభించలేదు. స్థలాలు కేటాయింపు జరిగితే వెంటనే పనులు చేపడుతాం.

- నవీన్‌కుమార్ పీఆర్ డీఈఈ మంథని

జడ్పీ సీఈవో సమీక్ష

పాలకుర్తి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు, ఇంటిపన్ను వసూలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జడ్పీ సీఈవో నరేందర్ హాజరై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో సుదర్శన్, ఏఈ పీఆర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉల్లి సాగు.. జాగ్రత్తలతో మేలు

న్యూస్‌టుడే, జమ్మికుంట



నిత్యం తీసుకునే ఆహార పదార్థాల తయారీలో ఉల్లి వినియోగం తప్పనిసరిగా ఉంటుంది. ఆరోగ్యరీత్యా మేలు చేసే ఉల్లిని రాష్ట్రవ్యాప్తంగా 70 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కుగాను అక్టోబరు నుంచి ఉల్లిని సాగు చేసుకోవచ్చు. రైతులు మొదటి నుంచి మెలకువలు పాటిస్తే లాభాలు ఉంటాయని **జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త జి. వేణుగోపాల్** చెబుతున్నారు.

ప్రతీ అడుగు కీలకమే..

ఉల్లిని వానాకాలం, యాసంగి, వేసవి.. ఇలా మూడు కాలాల్లో సాగు చేయవచ్చు. యాసంగి సాగును అక్టోబరు నుంచి డిసెంబరు వరకు చేపడతారు. ఎకరానికి 130 క్వింటాళ్ల నుంచి 160 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. విత్తనాలను నాటుకునే ముందు కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి లేదా 3 గ్రాముల థైరమ్ లేదా



ఉల్లి సాగు

కాప్టాన్ వినియోగించి విత్తన శుద్ధి చేసుకోవచ్చు. ముందుగా నారు మళ్లపై సన్నని గీతలు వేసుకొని వరుసలో విత్తనాలు వేసుకొని మట్టితో కలపాలి. నారుకుళ్లు తెగులు నుంచి పైరు కాపాడుకునేందుకు 10 రోజులకోసారి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మడులను తడపాలి. రసం పీల్చే పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుల అడుగు భాగంలో తెల్లమచ్చలు (మజ్జిగ తెగులు) ఏర్పడుతాయి. నివారణకు లీటరు నీటికి 2.మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

విత్తుకునే పద్ధతి

ఎకరం విస్తీర్ణంలో సాగుకు 3 కిలోల నుంచి 4 కిలోల విత్తనాలు అవసరం. నారు పెంపకానికి ఎత్తైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. పలువురు రైతులు సమతల మడుల్లో నారు పెంచుతున్నారు. దీంతో మురుగు వెళ్లే పరిస్థితి లేక నారుకు తెగులు సోకి చివరకు సరిపడ నారు లేక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. సమస్యను అధిగమించేందుకు ఎంచుకున్న పొలాన్ని 3 నుంచి నాలుగు సార్లు దున్నుకోవాలి. ఒక్కో నారుమడి 1 మీటరు వెడల్పు, 3 మీటర్ల పొడవు 15 సెం.మీ ఎత్తు ఉండేలా ఎత్తు మడులను ఏర్పాటు చేసుకోవాలి. 2 మడుల మధ్య అడుగు దూరం ఉండేలా చేసుకుంటే నడుస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. 50శాతం నీడనిచ్చే షేడ్ నెట్‌లను ఉపయోగిస్తే మొలక శాతం బాగుంటుంది.

విత్తనాల్లో రకాలు

- రైతులు ఎరుపు, తెలుపు వర్ణాల ఉల్లి సాగుకు విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు.
- ఎరుపు వర్ణం ఉల్లి విత్తనాల రకాల్లో బళ్లారి రెడ్, రాంపూర్ రెడ్, నాసిక్‌రెడ్, అగ్రిఫౌండ్ లైట్ రెడ్, పూసాలరెడ్, అర్కనికేతన్, అర్క కల్యాణ్, అర్క ప్రగతి, ఎన్-53లను ఎంపిక చేసుకోవచ్చు.
- తెలుపు వర్ణంలో పూసా వైట్ రౌండ్, పూసా వైట్ ఫ్లాట్ రకాలు అనుకూలం. ప్రైవేటు హైబ్రీడ్స్‌లో సెమినిస్ ఎక్స్‌పీహెచ్‌వోఎస్-3, తయోవైట్ తదితర రకాలు ప్రాచుర్యం పొందాయి.

విరులు.. లాభాల సిరులు

న్యూస్‌టుడే, కమాన్‌పూర్



బంతి తోటలో రాజమల్లు దంపతులు

మూస ధోరణి పద్ధతిలో పంటలను సాగు చేయకుండా విభిన్నంగా కొంతమంది రైతులు ఆలోచిస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సాగులో రాణిస్తున్నారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన రైతు మూగ రాజమల్లు తనకున్న 1.10 గుంటల భూమిలో బంతి పంటను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. 30 ఏళ్లుగా బంతి పంట సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎకరాకు రూ. 4 లక్షల ఆదాయం జూన్-జులై, అక్టోబరు-నవంబరు మాసాల్లో బంతి పంటను సాగు చేపడతారు. ఎకరాకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరాకు గతేడాది 72 క్వింటాళ్ల దిగుబడి (ఒక పంటకు) సాధించినట్లు రైతు తెలిపారు. క్వింటాకు రూ.4,000-4,500 వరకు మార్కెట్ ధర ఆధారంగా విక్రయిస్తారు. ఖర్చులుపోను ఎకరాకు రూ.2 లక్షలు, ఏడాదికి రెండు పంటలకు కలిపి రూ.4 లక్షలకుపైగా ఆదాయం పొందుతున్నారు. పండగలకు విడిగా కిలో రూ.80-100 వరకు అమ్ముతున్నారు.

సాగు ఇలా..: మొక్కలు నాటిన 100 రోజుల్లో బంతి పూలు కోయొచ్చు. సాగుకు కావాల్సిన విత్తనాలను కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి తీసుకు వస్తున్నారు. ఎకరాకు సుమారు 8 వేల మొక్కలు నాటుతారు. దుక్కుల నాటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడుతూ.. పంట కలుపు, పురుగు మందులు ఆశించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని ఏడాదిలో రెండుసార్లు సాగు చేస్తున్నారు.

పండ్ల తోటలకు ఏ నేలలు అనుకూలం?

మీకు తెలుసా?


పండ్ల తోటల సాగుకు అనువైన నేలలు, నీటివసతిగల వాటినే సాగుకు ఎన్నుకోవాలి. లోతైన ఎర్రగరప నేలలు, బాగా నీరింకే ఒండ్రునేలలు, మధ్యతరహా నల్లనేలలు, చెల్క నేలలు పండ్లతోటల సాగుకు శ్రేష్ఠమైనవి. సారవంతమైన మట్టిగల నేలలోతు కనీసం 5 అడుగులు ఉండాలి. మొదటి 5 అడుగుల్లో రాతిచట్టు, సున్నపురాయి తగలకూడదు. అన్ని సీజన్లలోనూ సగటు భూగర్భ జలమట్టం 6 అడుగుల దిగువనే ఉండాలి. బంకమన్ను 40 శాతానికి మించి, సున్నం 10 శాతానికి మించి ఉండరాదు- **న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం**

రైతు ప్రశ్న - శాస్త్రవేత్త సమాధానం

? వరి ముదురాకు చివరలో మధ్య ఈనెకు ఇరు పక్కల మచ్చలు కనబడుతున్నాయి. ఏం చేయాలి?

- ఈ.రమేశ్, వెంకట్రావ్‌పల్లి

✓ జింకు లోపం కారణం. లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



జె.విజయ్, జమ్మికుంట కేవీకే

? పత్తిలో పూత, పిందెలు, కాయలు రాలుతున్నాయి. నివారణ ఎలా? –తిరుపతి, మొగిలిపాలెం

✓ ప్లానోఫిక్స్ ద్రావణాన్ని 5 లీటర్ల నీటికి 1 మి.లీ. వంతున కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, జమ్మికుంట

సామాజిక సేవ.. సాహసాలకు తోవ

పర్వతారోహణకు ఎంపికైన క్యాడెట్లు

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



గతేడాది పర్వతాన్ని అధిరోయించిన విద్యార్థులు

విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలు, సేవాభావం, దేశభక్తి పెంపొందించాలి. అప్పుడే వారిలో దాగి ఉన్న ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది.. వారి జీవితానికీ బాటలు పరచుకుంటాయి. పాఠశాలలు, కళాశాలల్లో భారత సాయుధ దళాల యువ విభాగం నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్)లు విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతున్నాయి. విద్యార్థులకు పలు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వారిలో సమాజ దృక్పథాన్ని పెంపొందిస్తున్నాయి. అందులో ఒకటి పర్వతారోహణ శిబిరం. శాతవాహన విశ్వవిద్యాలయ విద్యార్థులు మరో వారం రోజుల్లో ఆ శిబిరానికి వెళ్లనున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

22 నుంచి పది రోజులపాటు శిబిరం

శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 10 మంది చురుకైన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. వారిని ఈనెల 22 నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే అటల్ బిహారీ వాజ్‌పేయీ మౌంటెనింగ్ అండ్ అడ్వెంచర్ శిబిరానికి తీసుకెళ్లనున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు మైనస్ డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో ఉండాల్సి ఉంటుంది. పర్వతారోహణ, తాడు సహాయంతో లోయలు దాటడం, పర్వతాలు, కొండల్లో ప్రమాదాలు జరిగితే బాధితులను తరలించటం, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలు చేయడం తదితర అంశాలపై పది రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. గుడారాలు ఏర్పాటు చేసుకొని అందులోనే ఉంటూ వాలంటీర్లు ఈ శిక్షణలో పాల్గొననున్నారు.

మలావత్ పూర్ణే ప్రేరణ



మాది సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం బడి తండా. పదో తరగతి స్వగ్రామంలో, ఇంటర్ రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాను. చిన్నతనంలో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ ప్రేరణతో ట్రెక్కింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

- మాలోత్ అనిల్, బీకాం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానం



జగిత్యాలలోని ధూంపేట గ్రామం మాది. నాన్న మోహన్‌రెడ్డి గల్ఫ్ కార్మికుడు. అమ్మ వ్యవసాయం చేస్తుంది. సెలవు రోజుల్లో నేను కూడా పొలం పనులకు వెళ్తుంటాను. కళాశాలలో చదువుతూనే ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సేవాభావం ఆకళింపు చేసుకున్నా. వాలంటీర్‌గా విశ్వవిద్యాలయం స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచా. శిబిరంలో పాల్గొనేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా.

- ఏ.అనూష, ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, జగిత్యాల

కోచ్ మాటలతో స్ఫూర్తి పొందా..



మాది సిరిసిల్ల జిల్లాలోని పొట్యాల గ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. ఎన్‌ఎస్‌ఎస్ కోచ్ వాణిశ్రీ మేడం మాటలతో స్ఫూర్తి పొందాను. ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్ల ఎంపిక పోటీల్లో విశ్వవిద్యాలయం స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పటి నుంచో పర్వతారోహణ చేయాలని అనుకునేదాన్ని. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. సద్వినియోగం చేసుకుంటాను. **- ఆర్.సంధ్య, బీఏ, టీటీడబ్ల్యూఆర్‌డీసీ(మహిళా), రాజన్న సిరిసిల్ల జిల్లా**


ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా



చదువుతోపాటు, ఆటలు, వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా. త్వరగా శిబిరానికి వెళ్లి మంచు పర్వతాలను ఎక్కేయ్యాలని ఉంది.

- కె.తులసిదాస్, బీఏ, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

విద్యార్థుల్లో సేవాభావం పెంపు



ఈ శిబిరానికి బృంద నాయకుడిగా వ్యవహరిస్తున్నాను. ఈ సాహస శిబిరంతో విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుంది. ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో తెలుస్తుంది. ధైర్య సాహసాలు పెంపొందుతాయి. జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన ఏర్పడుతుంది. పలువురికి సహాయం చేయాలనే దృక్పథం అలవడుతుంది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవటంతోపాటు దేశసేవలో ముందు వరుసలో ఉంటారు.

- పడాల తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, వృక్షశాస్త్రం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ఎల్ఎల్ఎం పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత ఆగస్టు నెలలో నిర్వహించిన ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నలుగురు అటవీశాఖ అధికారులపై వేటు


జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజర్ బి.అరుణ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై వేటుపడింది. ఈనెల 11న అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో మైసమ్మ పూజ పేరుతో మందు విందు చేసుకోగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ రేంజర్‌ను సస్పెండ్ చేస్తూ బాసర సర్కిల్ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సి.సరవనన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు బీట్ అధికారి సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్, వాచర్ రహీంను జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్ విధుల్లోంచి తొలగించారు. మొత్తం నలుగురిపై చర్యలు తీసుకోగా పరారైన ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారి రాజశేఖర్, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి రవీందర్ సంఘటనపై పూర్తి విచారణ చేస్తున్నారు.

పత్తి గరిష్ఠ ధర రూ.6,960

జమ్మికుంట : నాలుగు రోజుల సెలవుల అనంతరం సోమవారం జమ్మికుంట మార్కెట్‌కు తక్కువగా పత్తి విక్రయానికి వచ్చింది. కేవలం 14 ట్రాలీల కొత్త విడిపత్తి మార్కెట్‌కు రాగా బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,200 గరిష్ఠంగా రూ.6,960 ధర పలికింది. 7 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,300 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

ఇద్దరు యువకుల దుర్మరణం



విక్కుర్తి దిలీప్



సూర అనిల్

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అతి వేగంతో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22), సూర అనిల్ (21) అనే ఇద్దరు స్నేహితులు. గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో రాత్రి వరకు సంతోషంగా గడిపారు. నిమజ్జనం అనంతరం దిలీప్ కొనుగోలు చేసిన నూతన ద్విచక్ర వాహనంపై సరదాగా కోనరావుపేట మండలం మామిడిపల్లి వైపు వెళ్లారు. అతివేగంగా వెళ్తున్న వీరి వాహనం హన్మాజీపేట శివారులో మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న సూర అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా, వాహనం నడుపుతున్న దిలీప్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి దిలీప్‌ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డిగ్రీ పూర్తి చేసిన దిలీప్ హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉండగా దసరా పండగకు ఇంటికి వచ్చాడు. అనిల్ ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం చేస్తుండేవాడు. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై మారుతి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దిలీప్ తండ్రి రాజేశం గల్ఫ్ వెళ్లగా తల్లి జూలి అంగన్‌వాడీ టీచర్. అనిల్ తండ్రి అంజయ్య గల్ఫ్ వెళ్లగా తల్లి లక్ష్మి వ్యవసాయం చేస్తుంది. కొత్త బండి మోజు తీరకముందే వెళ్లిపోయావా బిడ్డా అంటూ తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?

న్యూస్‌టుడే, వేములవాడ

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

ప్రకటించిన ప్రోత్సాహక నగదు వివరాలు

సంవత్సరం	ప్రకటించిన ప్రోత్సాహకం (రూ.లక్షల్లో)
2021-22	7
2022-23	7
2023-24	15

మూడేళ్లుగా 'కాయకల్ప'కు ప్రాంతీయ ఆసుపత్రి ఎంపిక



వేములవాడ ఏరియా ఆసుపత్రి

- సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర, ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భ సంచిలో గడ్డల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూ జరుగుతుంటాయి.
- సెప్టెంబరు 6న 24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు.
- ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది.

ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగపడతాయి

ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది.

– సంతోష్‌చారి, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

ఎంపిక విధానం ఇలా...

కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు.

- ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారు.
- వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని జులై 26న రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది.
- మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

వికటించిన వ్యాక్సిన్

- రెండుసార్లు శస్త్రచికిత్స చేయించుకున్నా మెరుగుపడని ఆరోగ్యం
- మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుల ఫిర్యాదు



బాధితులు చంద్రశేఖర్, రాకేశ్, రంజిత్‌కుమార్



వ్యాక్సిన్ వేసిన చోట ఏర్పడిన పుండు

కోరుట్ల, న్యూస్‌టుడే: గల్ఫ్ వెళ్లే క్రమంలో వైద్య పరీక్షల్లో భాగంగా వ్యాక్సిన్ వేయించుకోగా చేతికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాని పరిస్థితి నెలకొందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. . జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, మరో యువకుడు, మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన రాకేశ్ సౌదీ అరేబియా, బెహ్రెయిన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చంద్రశేఖర్‌కు సౌదీ వీసా రావడంతో నాలుగు నెలల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షల్లో భాగంగా కుడి చేతికి వ్యాక్సిన్ ఇచ్చారు. 20 రోజుల తర్వాత వ్యాక్సిన్ తీసుకున్న చోట గడ్డ ఏర్పడగా తగ్గిపోతుందని సౌదీ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పనిలో చేరాడు. తర్వాత కొద్దిరోజులకు వ్యాక్సిన్ తీసుకున్న చోట పుండు కావడంతో ఆసుపత్రికి వెళ్లినా నయం కాకపోగా శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. ఇండియాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కంపెనీ నిర్వాహకులను కోరగా అనుమతి ఇవ్వలేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఇండియా ఎంబసీలో దరఖాస్తు చేసుకున్నా పంపించలేదు. 5 వేల సౌదీ రియాల్‌లు తీసుకొని పంపించారు. 40 రోజుల కిందట సంగెంకు చేరుకున్న చంద్రశేఖర్ కోరుట్ల ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపాడు. సంగెంకు చెందిన రంజిత్‌కుమార్ బహ్రెయిన్‌కు, మోహన్‌రావుపేటకు చెందిన రాకేశ్ సౌదీ వెళ్లేందుకు జూన్ చివర్లో హైదరాబాద్‌లోని అదే మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయిచుకోగా వీరికి కూడా వ్యాక్సిన్ ఇచ్చారు. రెండు నెలల తర్వాత వ్యాక్సిన్ తీసుకున్న చోట ఇన్‌ఫెక్షన్‌సోకి గడ్డలాగా తయారైంది. వెంటనే కోరుట్లలోని ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకోగా నయమైంది. దీంతో వీరు గల్ఫ్ వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయారు. రెండు వారాల కిందట శస్త్రచికిత్స చేసిన చోట మరోమారు నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోలేదని మరోమారు శస్త్రచికిత్స చేయాలని సూచించడంతో వారం రోజుల కిందట రెండోసారి సర్జరీ చేయించుకున్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాలని ఆశపడితే మెడికల్ సెంటర్‌లో ఇచ్చిన వ్యాక్సిన్‌తో ఆనారోగ్యానికి గురై వెళ్లలేకపోయామని వాపోయారు. సోమవారం బాధితులు చంద్రశేఖర్, రంజిత్‌కుమార్, రాకేశ్ సదరు మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని తెలిపారు. సంబంధిత మెడికల్ సెంటర్ ఉన్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించినట్లు బాధితులు వాపోయారు. ఈవిషయమై సీఐ సురేశ్‌బాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న మెడికల్ సెంటర్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించామన్నారు. అక్కడే ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించినట్లు పేర్కొన్నారు.

నిధులున్నా రహదారి నిర్మాణంలో నిర్లక్ష్యం



చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట వరకు రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.98 కోట్ల నిధులు 2022లో మంజూరు చేశారు. కానీ గుత్తేదారు నేటికీ నిర్మించలేదు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. రహదారి పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చొప్పదండి

దసరాకు..

మత్తు ఎక్కించారు

గతేడాదితో పోల్చితే రూ.27 కోట్లు అధికం

న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు



దసరా పండుగ నేపథ్యంలో ఈ ఏడాది మద్యం వ్యాపారం భారీగా జరిగింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది దసరా వేడుకలకు రూ.139 కోట్ల వ్యాపారం సాగగా, ఈ ఏడాది రూ.166 కోట్లు వ్యాపారం సాగిందని అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే రూ.27 కోట్ల అధికంగా జరిగిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన లక్ష్యం రూ.165 కోట్లు దాటిపోయింది. మొత్తం 292 మద్యం దుకాణాలతోపాటు 54 బార్ల ద్వారా విక్రయాలు జరిగాయి.

ఎక్కువగా కరీంనగర్‌లో..

కరీంనగర్ కాకుండా పెద్దపల్లి జిల్లాలోని కార్మిక క్షేత్రం గోదావరిఖనిలో మద్యం వ్యాపారం ఎక్కువ సాగుతోంది. జనాభా ప్రాతిపదికన ఈ ప్రాంతాల్లో వ్యాపారం ఎక్కువగా ఉంటుందని అధికారులు భావించారు. ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 రోజుల ముందుగానే దసరా లక్ష్యాన్ని విధించి.. పూర్తి చేయాలని ఆదేశించింది. మద్యం దుకాణాల ద్వారా కాకుండా ఉమ్మడి జిల్లాలో ఉన్న 54 బార్ల ద్వారా మరో రూ.6 కోట్ల వ్యాపారం సాగింది.

జిల్లా	మద్యం దుకాణాలు	వ్యాపారం రూ.కోట్లలో
కరీంనగర్	94	46
పెద్దపల్లి	77	39
జగిత్యాల	63	41
సిరిసిల్ల	48	34

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, కమాన్‌పూర్

? కమాన్‌పూర్ మండలం రొంపికుంట పెద్దచెరువు కట్టపైన మొక్కలు నాటారు. రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. - స్థానికులు

✔ నాటిన మొక్కలకు కంచెలను ఏర్పాటు చేయిస్తాం. - ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి

నిధులు వెచ్చించారు.. వినియోగం మరిచారు

నగరపాలిక అధికారుల నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

నగరపాలిక పరిధిలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కేటాయించిన పట్టణ ప్రగతి నిధులు.. వాహనాల కొనుగోలు పేరిట వృథా అయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రగతి నిధులతో కొనుగోలు చేసిన వాహనాల్లో కేవలం స్వచ్ఛ ఆటో ట్రాలీలు, చెత్త తరలించడంలో కీలకమైన ఒక్కోటి రూ.70 లక్షలతో కొనుగోలు చేసిన రెండు కంపాక్టర్ వాహనాల్లో ఒకటి మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇదే తరహాలో ఫాగింగ్ మిషన్లు సైతం మూలనపడ్డాయి.


మూలన పడిన జెట్టింగ్ యంత్రం

● కొన్ని రోజులకే మూలకు..

ప్రధాన రహదారులను అత్యంత వేగంగా శుభ్రం చేయాలనే సంకల్పంతో పట్టణ ప్రగతి నిధులు రూ.65 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ కొన్నిరోజులు వినియోగించి మూలన పడేశారు. మధ్యలో ఓసారి మంత్రి పర్యటన సందర్భంగా ఒకటి, రెండు రోజులు వాడారు. కొన్ని మరమ్మతులు చేయించాల్సి రావడంతో పాటు డీజిల్ వినియోగం పెరుగుతుందంటూ మిషన్‌ను పక్కన పెట్టారు. ప్రధాన రహదారులను మళ్లీ యథావిధిగా కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు.

● చెత్త తరలింపులో కీలకం..

రామగుండం నగరపాలిక నిర్దేశించిన డంపింగ్ కేంద్రాల్లో.. చెత్తతో నిండిన కంపాక్టర్లను తరలించడంలో కీలకమైన వెహికల్ హుక్ లోడర్‌ను కొనుగోలు చేసినప్పటినుంచి.. ఒక్కసారి కూడా వినియోగించలేదు. పట్టణ ప్రగతి నిధులు రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన ఈ వాహనాన్ని గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రంలో నిలిపారు.

● నిరుపయోగంగా లిట్టర్ పిక్కర్

రహదారులపై ఊడ్చిన చెత్తను ఎత్తివేసేందుకు పట్టణ ప్రగతి నిధులు రూ.23.5 లక్షలతో లిట్టర్ పిక్కర్ వాహనాన్ని కొనుగోలు చేశారు. దీనికి డ్రైవరుతోపాటు చెత్తను పీల్చుకునే పైపును పట్టుకునేందుకు మరో ఇద్దరు కార్మికులు కావాల్సి ఉంది. సాధారణంగా కార్మికులతో ఆటో ట్రాలీల్లో చెత్తను ఎత్తించడమే దీనికి సులభతరం. అయినా అత్యాధునికం పేరిట కొనుగోలు చేసిన ఈ యంత్రాన్ని మొదట్లో కొద్ది రోజులు ఉపయోగించి వదిలేశారు.

● నగరవాసులపై భారం

సఫాయిమిత్రలో భాగంగా నగరంలోని సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయాలనే లక్ష్యంతో పట్టణ ప్రగతి నిధులు రూ.49 లక్షలతో కొనుగోలు చేసిన ప్రత్యేక అవసరాల జెట్టింగ్ యంత్రాన్ని.. కొద్దిరోజులు మాత్రమే ఉపయోగించారు. ప్రస్తుతం ప్రైవేటు వాహనాల ద్వారా మాత్రమే సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలను మానవ వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలిస్తున్నారు. వాహన ఛార్జీలను ఆయా కుటుంబాలే చెల్లించాల్సి వస్తుంది.


స్వీపింగ్ మిషన్

● ఉన్నతాధికారులకు నివేదిస్తాం

నగరపాలికలోని అన్ని వాహనాలను వినియోగంలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఆయా వాహనాల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వీటిపై జిల్లా అదనపు పాలనాధికారిణి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

- సునీల్, రామగుండం నగరపాక పారిశుద్ధ్య పర్యవేక్షకులు

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.87.91 కోట్లు

గోదావరిఖని: మంథని నియోజకవర్గంలోని మూడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.87.91 కోట్లు పరిపాలన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడవిసోమన్‌పల్లి, చిన్నఓదాల గ్రామాల సమీపంలోని మానేరు వాగు, ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ సమీప మోరంచవాగుపై నిర్మాణానికి రహదారులు భవనాల శాఖ ఆమోదించింది.

నేడు సాగుపై అవగాహన

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 9.30గంటలకు హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా శనగ, మినుము, యాసంగి, కంది, ఇతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఏవో ప్రమోద్‌కుమార్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

పాలకుర్తి(రామగుండం): ఇటీవల విజయవాడకు చెందిన ఓ లోకోపైలట్‌ను రైల్వేస్టేషన్‌లో దుండగులు హత్య చేయడాన్ని నిరసిస్తూ.. రామగుండం రైల్వే ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దాడి ఘటనను ఖండించారు. లోకోపైలట్ చిత్రపటానికి నివాళులర్పించారు. తమపై జరిగే దాడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముత్తారం: ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో మాజీ సర్పంచి జక్కుల సదానందం తల్లి రాంబాయి ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, భారాస ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారి నాగార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. విక్రయాలకు సంబంధించి విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. సరైన బిల్లులు ఇవ్వని, అమ్మకాల రికార్డులు నిర్వహించని దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ నిర్వాహకుడు భారాస నాయకుడు మనోహర్‌రెడ్డి- సంధ్యారాణి దంపతులు సోమవారం శివాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు

రహదారి ప్రమాదంలో దుర్మరణం


మహిపాల్‌రెడ్డి

ధర్మారం, న్యూస్‌టుడే: మండలంలోని కటికెనపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన అట్ల మహిపాల్‌రెడ్డి (48) మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఇదే మండలం రామన్నపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చిన మహిపాల్‌రెడ్డి - మాధవి దంపతులు ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తాటిపెల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. కటికెనపల్లి శివారులో కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొంది. మహిపాల్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో మాధవికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు మహిపాల్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంథని మండలంలోని అక్కేపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మంథని ఎస్సై దేగ రమేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన [illegible] ముత్తయ్య (49) పది సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. పలు వైద్యశాలల్లో చికిత్స పొందినా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపం చెందిన ముత్తయ్య.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు ముత్తయ్య భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


శ్రీనివాస్

గోదావరిఖని: స్థానిక ఎల్బీనగర్‌కు చెందిన మామిడి శ్రీనివాస్ (49) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనిచేస్తూ జీవించే శ్రీనివాస్ ఇటీవల మద్యానికి బానిసయ్యారు. దీంతోపాటు తన కుమార్తె వివాహం కావడంతో మానసికంగా కుంగిపోయారు. మనస్తాపం చెందిన శ్రీనివాస్ తన ఇంట్లో ఆదివారం రాత్రి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

గోదావరిఖనిలో మహిళ..


రాజేశ్వరి

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన తిప్పని రాజేశ్వరి(55) సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరి తన పెద్ద కుమారుడికి పెళ్లి చేసినప్పటికీ మద్యానికి బానిసయ్యాడు. కుమారుడి ప్రవర్తనపై మనస్తాపం చెందిన రాజేశ్వరి.. ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి రెండో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ విచారణ చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: కాలనీలోని కావేరి మద్యం దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు తెలిపారు. పోతనకాలనీ-సెంటినరీకాలనీ ప్రధాన మార్గం పక్కనే ఉన్న ఈ దుకాణంలోకి రేకుల ద్వారా దుండగులు ప్రవేశించి దొంగిలించారు. దుకాణంలో ఉన్న దాదాపు 50 వేల విలువైన మద్యం సీసాలను కౌంటర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మద్యం దుకాణ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు [illegible] వివరాలు నమోదు చేశారు.

యువకులకు పోలీసుల కౌన్సెలింగ్

గోదావరిఖని, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో సింగరేణి క్రీడా మైదానంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఇటీవల యువకులు గొడవపడ్డారు. దీనిపై పోలీసులు వారిని గుర్తించి సోమవారం వారి తల్లిదండ్రుల సమక్షంలో ఐదో ఏసీపీ రమేశ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లలను ఎప్పటికప్పుడు గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని.. గురువులను సన్మానించి ఆడిపాడారు.

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ): రామగిరి మండలం లద్నాపూర్‌లోని వందన ఉన్నత పాఠశాలలో 2007-2008 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించుకున్నారు. సెంటినరీకాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జ్ఞాపికలను అందించి శాలువ సత్కరించారు.


2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు


సెంటినరీకాలనీ: 2007-08 పదో తరగతి బ్యాచ్

వైభవంగా శోభాయాత్ర


నృత్యాలు చేస్తున్న కళాకారులు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కమాన్‌పూర్ మండల కేంద్రంలో వైభవంగా జరిగాయి. కమాన్‌పూర్ ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నిలిపి.. మండలంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్తుకాంతులు, డీజే, డప్పు చప్పుళ్ల నడుమ అమ్మవారి ఊరేగింపు జరిగింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంత్రిని కలిసిన పీఆర్‌టీయూటీఎస్ నాయకులు


మంత్రి శ్రీధర్‌బాబుకు మొక్క అందిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ జిల్లాశాఖ అధ్యక్షుడు సురేశ్

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: సమీకృత విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేసినందుకు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు సోమవారం పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్, ప్రధాన కార్యదర్శి గుండు కృష్ణమూర్తి తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రిని హైదరాబాద్‌లో కలిశారు. పలు ఉపాధ్యాయ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారని సురేశ్ స్థానిక విలేకరులకు తెలిపారు.

మహిళలకు మిషన్ శక్తిపై అవగాహన



రాఘవాపూర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారిణులు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో సోమవారం జిల్లా మహిళా సాధికారిత కేంద్రం నిర్వాహకులు మహిళా సంఘాల సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిశు మరణాల తగ్గింపు, షీ బృందాల సేవలు, మహిళా చట్టాలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు, మిషన్‌శక్తితో కల్పించనున్న ఉపాధి అవకాశాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు స్వప్న, ఆర్థిక అక్షరాస్యత శిక్షకురాలు సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా ఎన్నిక


శ్రీనివాస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రామగుండం శాఖ అధ్యక్షుడిగా క్యాస శ్రీనివాస్‌ను సోమవారం ఆ శాఖ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీవాణి, కోశాధికారిగా నాగిరెడ్డిలు నియమితులయ్యారు. ఈ ప్రాంతంలో వైద్యుల సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ పేర్కొన్నారు.

వంతెన నిర్మించినా తీరని సమస్య

పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో ఎస్సారెస్పీ కాలువపై కొత్తగా హైలెవల్ వంతెన నిర్మించారు. అయితే అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా కొంతమేర బీటీ రోడ్డు నిర్మించకపోవడంతో రోజుల తరబడి తమకు అవస్థలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. వంతెన ఎత్తులో ఉండటంతోపాటు చిన్నపాటి వర్షం కురిసినా మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పాలకుర్తి


ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన హైలెవల్ వంతెన

తీవ్ర జ్వరంతో ఉద్యోగి మృతి


సంపత్

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి జీడీకే-11 గనిలో పనిచేసే మోదుల సంపత్(48) తీవ్ర జ్వరంతో సోమవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సంపత్ స్థానిక ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స పొందారు. ఉదయం పరిస్థితి విషమించడంతో సింగరేణి ప్రాంతీయ ఆస్పత్రిలో చేరారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మృతిచెందారు. సంపత్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి పరిరక్షణ మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం ఆర్జీ-2 డివిజన్‌లోని ఓసీపీ-3 ప్రాజెక్టు ఆవరణలో నిర్వహించిన ఉజ్వల 'సింగరేణి-ఉద్యోగుల పాత్ర' అంశంపై నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు, ప్రభావిత పునరావాస గ్రామాలకు చేయూత తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అనంతరం కార్మికులతో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఏసీపీ రమేష్, జీఎం సూర్యనారాయణలు భోజనం చేశారు.

గనులపై ఉత్సాహంగా..


భోజనం వడ్డిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి బొగ్గు గనులపై సోమవారం బడాఖానా ఏర్పాటు చేశారు. కార్మికులందరూ కలిసి భోజనాలు చేసే విధంగా యాజమాన్యం దసరా సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లు చేసింది. ఆర్జీ-1 ప్రాంతంలోని అన్ని గనులు, విభాగాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొన్నారు. జీడీకే-11 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, సింగరేణి ఛైర్మన్ బలరాంల సందేశాల వీడియోలను ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జీఎం లలిత్‌కుమార్, ఏజెంటు శ్రీనివాస్, సీఎంవోఏఐ అధ్యక్షులు మల్లేశం, సంక్షేమాధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కవికి సన్మానం

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగిరి మండలం కల్వచర్లకు చెందిన నూనె రాజేశాన్ని సోమవారం కరీంనగర్‌లో జరిగిన కవి సమ్మేళనంలో సత్కరించారు. కవి, రచయిత వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన.. మహాకవి దాశరథి స్మృతులను కొనియాడుతూ.. 84 మంది కవులు రాసిన దిక్కార స్వర జ్యూరీ కవితలు, పాటలు, పద్యాలు, కవిత్వాలు తదితర అంశాలపై కవి సమ్మేళనంలో వక్తల పాటల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రాజేశం కవి దాశరథి కృష్ణమాచార్య మీద రాసిన పాటకు వక్తల చేతుల మీదుగా శాలువ కప్పి సత్కరించి పుస్తకం అందించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ముత్తారం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయని ముత్తారం ఎంపీడీవో సురేశ్ తెలిపారు. కేశనపల్లిలో ఆయన సోమవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తగిన సలహాలు, సూచనలు చేశారు.

వార సంత.. రాకపోకలకు చింత

ధర్మారంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంత ప్రధాన రహదారికిరువైపులా నిర్వహిస్తుండటంతో వాహనదారులకు అసౌకర్యంగా మారింది. అంబేడ్కర్ కూడలి నుండి పాత బస్టాండు వరకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల దుకాణాలతో కిక్కిరిసి ఉంటోంది. దీంతో కరీంగనర్ నుండి జగిత్యాల జిల్లా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ వారసంతకు ధర్మారంతో పాటు పరిసర మండలాల నుంచి సామగ్రి కొనుగోలుకు వస్తారు. దీంతో రద్దీగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారసంత నిర్వహణకు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తే పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉండటంతోపాటు.. వాహనదారుల అసౌకర్యమూ తీరనుంది. - న్యూస్‌టుడే, ధర్మారం


వారసంతతో ప్రధాన రహదారిపై రద్దీ

శునకాలు.. తప్పని ఇబ్బందులు


ముల్కలపల్లిలో శునకాలు

రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో శునకాల బెడద వేధిస్తోంది. గ్రామాల్లో శునకాలు యథేచ్ఛగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల రామగిరి మండలం రామయ్యపల్లిలో శునకాలు ఓ దూడెపై దాడి చేసి హతమార్చాయి. కార్లు, ద్విచక్రవాహనాల వెంట పడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సంబంధిత అధికారులు శునకాల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ)

అందం.. ఆహ్లాదం

గ్రామీణ మండలాలకు వ్యాపార, విద్యాసంస్థలకు కేంద్రమైన ధర్మారం చుట్టూ ఎత్తైన కొండలు, పంట పొలాలు పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తూర్పు వైపు శ్రీవేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి వెలసిన కొండల వరుస.. పడమర వైపు మల్లికార్జునస్వామి కొండ, ఎత్తైన గుట్టలు ధర్మారానికి పెట్టని కోటలా ఉన్నాయి. దక్షిణాన ఊరచెరువు, సీతారామచంద్రస్వామి ఆలయం, ఉత్తరాన శీతల చెరువు వాగు, పంట పొలాలతో ఎటు చూసినా ఇలా పచ్చదనం కన్పిస్తోంది. - న్యూస్‌టుడే, ధర్మారం

